# ఏరివేత

రేపటిలోగా ఏరివేత కార్యక్రమం ముగించాలి. నేను మావాళ్ళచేత పూర్తి చేయించాల్సిన పని. పూర్తి చేయలేక పోయినా పూర్తి చేసేశామని రిపోర్టు రాసి ఇవ్వొచ్చు. మా డిపార్టుమెంటులో చాలా మంది అలా చేస్తుంటారు. నేనలా దొంగ రిపోర్టులు రాయడానికి అలవాటుపడలేదు.

ఆ ప్రాంతంలో పదిహేను వరకు ఏరివేత కేంద్రాలున్నాయి. బోగస్ రేషన్ కార్డులు ఒకటికి రెండుసార్లు విచారించి ఏరివేసేయాలి. ఎన్ని ఏరివేశామో పై అధికారులకు వివరాలు పంపించాలి. నాకు బదిలీ అయిన తర్వాత అటుపక్కకు

రావడం అది మొదటిసారి. సూర్యారావుకిచ్చిన పని వెనుకబడిపోయి ఉండకపోతే నేను వచ్చే అవకాశం ఉండేది కాదు.

దానం మాస్టారు ఆ ఊరు గురించి నాతో చాలాసార్లు చెప్పడం జరిగింది. ఎందుకు చెపుతుండేవారో వివరంగా ఎప్పుడూ అడగలేదు. నిజం చెప్పాలంటే పట్టించుకోలేదు. ఇప్పుడు దానం మాస్టారు లేరు. ఆయన చనిపోయిన కబురు చాలా ఆలస్యంగా అందింది. ఆయన నాకేం కారు. అయినా నేనింతదాన్ని కావడానికి కారణం ఆయనే.

సూర్యారావుకు యాభైఅయిదు సంవత్సరాలుంటాయి. సన్నగా, పొడుగ్గా ఉంటాడు. జీవితంలోని విరక్తికి ప్రతిరూపంగా కనిపిస్తుంటాడు. చేసేపని జాగ్రత్తగా ఉంటుంది. పొరపాట్లు చేయడు. కాకపోతే నెమ్మదిగా ఉంటుంది. అతని దగ్గరున్న గొప్పగుణం లంచాలు తీసుకోడు.

అతని కేంద్రానికి వెళ్ళేసరికి కమ్యూనిటీ హాలు బయట వేసిన షామియానాలో నలభై మంది వరకు బెంచీలమీద కూర్చుని ఉన్నారు. ఒక్కొక్కరిని పిలిచి విచారించడానికి ఇవేళ సరిపోదు. నన్ను చూడగానే చేస్తోన్న పని ఆపి కుర్చీలోంచి లేవబోయాడు.

"కూర్చోండి. మీకో అసిస్టెంట్‌ను ఇచ్చాం కదా?" అన్నాను.

తలగోక్కుని, "మీరొచ్చేముందే టీ తాగడానికి బయటకు వెళ్లాడు" అన్నాడు సూర్యారావు.

అతనికిచ్చిన అసిస్టెంటు పేరు మునుస్వామి. తనకు చిన్నమెత్తు లాభం లేనిదే కాయితం మీద కలం పెట్టడు. అవకతవకలుచేస్తుంటాడు. పై అధికారుల ఆశీర్వాదం చాలా తేలికగా సంపాయించుకుంటుంటాడు. ఎక్కడికి బదిలీ చేసినా ఇదే తంతు. చేసేది రెవెన్యూ ఇన్స్‌పెక్టరైనా మూడు ఇళ్ళు కట్టుకున్నాడు. ఆఫీసు మూసేవేళకు ఆఫీసుకు వచ్చి రాత్రి పదింటివరకు కూర్చుంటాడు. నేను కొత్తగా పోస్టింగ్ మీద రావడం వలన పరిస్థితులు మరింత అవగాహన చేసుకోవడానికి సమయం పడుతుంది.

"మీ పేపర్లు నాకు కొన్ని ఇవ్వండి. నేను చూస్తాను" అన్నాను.

"వద్దండీ. చకచక లాగేస్తాను" అన్నాడు సూర్యారావు.

"ఇవ్వండి. నాకు వేరే పనేమీ లేదు. నేనేమీ అనుకోను".

అతను అయిష్టంగానే కొన్ని కాయితాలు ఇచ్చాడు. మరికొన్ని తీసుకుని వరండా చివర మరో బల్ల అమర్చుకుని, ప్లాస్టిక్ కుర్చీ లాక్కుని కూర్చున్నాను. లాప్‌టాప్ బల్లమీద పెట్టుకుని ఆన్‌చేసి నా దగ్గరున్న పేపర్ల నుంచి ఒక్కోపేరు చెపుతోంటే బంట్రోతు పిలుస్తున్నాడు. అందరి వివరాలు కంప్యూటర్‌లో ఉన్నాయి. ఎడాపెడా ఇచ్చింది మావాళ్ళే. కాకుల లెక్కేఅయినా ఆంధ్రప్రదేశ్ మొత్తంగా చూసుకుంటే దక్షిణ భారతదేశమంత జనాభా సంఖ్య ఉంది.

నా దగ్గరున్న వివరాలు చూస్తూ ఎవరితోనూ కఠినంగా మాట్లాడకుండా, నా పక్క కుర్చీలో కూర్చోబెట్టుకుని నిజానిజాలు వాళ్ళనే చెప్పమన్నాను. ఎక్కువమంది తెల్లకార్డులవాళ్ళు ఒక్కో కార్డులో ఎనిమిదేసి, పదేసి పేర్లున్నాయి. ఇద్దరు ముగ్గురు తప్ప చాలామంది దొంగపేర్లు రాయించామని ఒప్పుకున్నారు. రాయించడానికి కారణం అక్కడి నాయకులన్నారు కానీ ఎవరి పేరూ చెప్పలేదు. నేనడగలేదు.

"మా మీద చర్య ఏమైనా తీసుకుటారా?" అని అయిదారుగురేమో అడిగితే, "ఏ చర్యా తీసుకోం. ఇకనుండి ఇటువంటి పనులు చేయకండి. ఇందులో మీకొచ్చే లాభం కన్నా మీ రేషన్ షాపు డీలర్ ఎక్కువ లాభపడతాడు" అని పాతవి తీసుకుని కొత్త టెంపరరీ కార్డులు ఇచ్చాను.

అయిదు పేర్లు మిగిలాయి. నలుగురు రాలేదు. అయిదవుతుండగా లచ్చుమమ్మను పిలిపించాను. రుసరుసలాడుతూనే వచ్చింది. నా పక్కసీటు చూపించాను. కూర్చుంది. అయిష్టంగానే కార్డు బల్లమీద పెట్టింది. తెల్లకార్డుతోపాటు తన కుటుంబ సభ్యుల ఫోటోలు నా ముందుంచింది. ఆమెకు అరవై అయిదు సంవత్సరాలు పైగానే ఉంటుంది. చూడడానికి తక్కువ వయస్కురాలిగా కనిపిస్తోంది.

"మీరెంతమంది?" అడిగాను.

"ఆరుగురం" అంది.

"ఎవరెవరు?"

"ఈ ఫోటోలో ఉంది నా కొడుకు. ఇది వాడి భార్య. ఇదో ఈ ఫోటోలో ఉంది నా కూతురు. ఇతను అల్లుడు. ఈ పిల్ల వాళ్ళ కూతురు."

"నీ కొడుకూ కోడలు నీదగ్గర ఉండడం లేదు కదా?"

"కార్డు రాయించినప్పుడున్నారు."

"అల్లుడు నీదగ్గర ఉండడం లేదు. అసలీ ఊళ్ళోనే ఉండడం లేదు. నీ కూతురు చనిపోయి చాలా సంవత్సరాలు కాలేదూ? ఈ సీతాలనే పిల్ల ఎవరు?"

"నా మనవరాలు. కూతరు బిడ్డ"

"నీదగ్గరే ఉంటోందా?"

"ఆ. హాస్టల్లో ఉంటోంది"

"ఏం చదువుతోంది?"

"పదో క్లాసు"

ఎక్కడ అని అడగలేదు. అడగడం అనవసరం. ప్రతిమాటా అబద్ధమే చెపుతోంది.

"మీ ఇంట్లో టీవీ, ఫ్రిజ్, గ్యాస్ కనెక్షన్లున్నాయా?"

"ఇవ్వాళ రేపూ లేనిదెవరికట?"

"నేనడిగింది నీ సంగతి" అని ఆమె కూతురు ఫోటోవంక చూశాను. సలుపయినా చక్కగా ఉంది. ఫోటో వెనకాల పేరు రాసి ఉంది. సరస్వతి అని. ఆమె చనిపోయి ఇరవై ఎనిమిది సంవత్సరాలయింది.

ఎమ్మార్వో భవనం కడుతున్నప్పుడు మూడో అంతస్తు నుండి కాలుజారి కిందపడి అక్కడికక్కడే చనిపోయింది. అప్పటికి సరస్వతికి పెళ్ళి అయి రెండేళ్ళు కూడా పూర్తి కాలేదు. సంవత్సరం పాప. ఆ పాప బాధ్యత తండ్రి తీసుకోలేదు. లచ్చుమమ్మా తీసుకోలేదు. నెల తిరగకుండానే సరస్వతి భర్త వేరే పెళ్ళి చేసుకున్నాడు.

సరస్వతి చావుకు కాంట్రాక్టర్ రెండులక్షల రూపాయలు ఇస్తాననప్పుడు సరస్వతి భర్తా వచ్చాడు. లచ్చుమమ్మా వచ్చింది. చెరో లక్ష తీసుకోడానికి అంగీకారం కుదిరింది.

"పాప బాధ్యత ఎవరు తీసుకుంటారు?" దాసం మాస్టారు అడిగారు.

"చూసుకోవడం ఏమిటి సారూ? చిన్నపిల్లను సాకడం అంత తేలికైన పనా?

మగపిల్లాడయితే పర్వాలేదు. ఆడసలుసు ఎవరికి కావాలి?" అంది లచ్చుమమ్మ. సరస్వతి భర్తేం మాట్లాడలేదు.

"ఏం చేద్దాం?"

"నోట్లో వడ్లగింజ పెడితే చాలదేంటి? కిక్కురుమనకుండా చస్తుంది" లచ్చుమమ్మ తేల్చి చెప్పేసింది.

కాంపెన్‌సేషన్ ఇచ్చినా పాపను చంపేస్తారు. దాసం మాస్టారు ఆ పాపను ప్రభుత్వ ఆధీనంలో ఉంచారు. ఆ పాపే పెరిగి పెద్దదయి చదువుకుని తాసిల్దారయింది.

అమ్మ ఫోటో మటుకు ఉంచుకుని కార్డు కేన్సిల్ చేశాను.

"నా కార్డు?" అడిగింది.

తల అడ్డంగా ఆడించి, "ఇవ్వను. నీ దిక్కున్న చోటకు వెళ్ళి చెప్పుకో పో..." అరిచాను.

*సాహితీ స్రవంతి, సెప్టెంబర్-అక్టోబర్ 2012*